

అంగన్‌వాడీల్లో సీసీ కెమెరాలు పెట్టడాన్ని ఉప సంహరించుకోవాలి

కామారెడ్డి రూరల్, మార్చి 3: అంగన్‌వాడీ సెంటర్లలో రాష్ట్ర ప్రభుత్వం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాడాన్ని సీఐటీయూ పక్షాన ఖండిస్తున్నామని సీఐటీయూ నాయకుడు చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 70వేల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మూడేళ్ల నుంచి బిల్స్ లేవని, పౌష్టికాహారానికి నిధుల ఇవ్వడం లేదు కానీ సీసీ కెమెరాలు పెడతానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం సరైందికాదని అన్నారు. రోగానికి మందు వేయకుండా ప్రాణాలు తీయడానికి ఉరివేసే చర్యలు మానుకోవాలని అన్నారు. అంగన్‌వాడీ సెంటర్లను బలోపేతం చేసేదిశగా సీఎం చర్యలు తీసుకోవాలని అన్నారు.

అడుగంటుతున్న.. భూగర్భ జలాలు

- రోజు రోజుకూ అడుగంటుతున్న భూగర్భ జలాలు
- జిల్లా సరాసరి 12.50 మీటర్ల లోతులో జలం
- నెల వ్యవధిలోనే 1.99 మీటర్లకు పడిపోయిన నీరు
- అత్యధికంగా వరి సాగు, పెరుగుతున్న ఎండలే కారణం
- మే కల్లా 15 మీటర్ల లోతులోకి పడిపోయే అవకాశం
- ఎత్తిపోతున్న మోటార్లు.. ఎండిపోతున్న బావులు
- జలాలను పొదుపుగా వాడుకుంటేనే మేలు

కామారెడ్డి టౌన్, మార్చి 3: జిల్లాలో భూగర్భజలాలు పాతాళానికి పడిపోతున్నాయి. రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటుతుండడం ఆందోళనకు గురి చేస్తోంది. మార్చి నెలలో జిల్లాలో భూగర్భ జలాలు 12.50 మీటర్ల లోతులోకి పడిపోయాయి. మే నెల కల్లా 15 మీటర్ల లోతులోకి నీటి మట్టం పడిపోయే అవకాశం ఉంది. భూగర్భ జలాలు 15 మీటర్ల లోతులోకి పడిపోతే ఆ జిల్లా డేంజర్ జోన్ స్థాయిలో ఉన్నట్లు. దీంతో మే మాసంలో కామారెడ్డి జిల్లా భూగర్భ జలాల విషయంలో డేంజర్ జోన్‌లో పడే అవకాశం ఉందని సంబంధిత శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే కామారెడ్డి, ఎల్లారెడ్డి డివిజన్లలో మోటార్ బోర్లు ఎత్తిపోతుండగా నీటి బావులు ఎండిపోతున్నాయి. దీంతో బోరు బావుల కింద వేసిన పంట పొలాలు నీరు లేక బీటలు వారుతున్నాయి. జిల్లాలో మారుమూల గ్రామాలు తండాల్లో తాగునీటి సమస్య ఎదురవుతుంది. రోజు రోజుకూ ఎండలు ముదరడంతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులలోను నీరు తగ్గుముఖం పడుతోంది. అదే విధంగా జిల్లాలో అధిక మొత్తంలో వరి సాగు చేయడంతో పాటు అవి పొట్ట దశకు రావడంతో నీటి వాడకం అధికం కావడం వల్ల భూగర్భ జలాలు సైతం తగ్గుముఖం పట్టాయి. నెల వ్యవధిలోనే జిల్లాలో సరాసరిగా 1.99 మీటర్ల లోతులోకి భూగర్భ జలాలు పడిపోయాయి. కామారెడ్డి, ఎల్లారెడ్డి డివిజన్లలో అత్యధికంగా భూగర్భ జలాలు లోపలికి వెళ్లాయి. నీటి వాడకం ఇదే విధంగా కొనసాగితే మే నెలలో డేంజర్ జోన్‌లోకి పడిపోయే అవకాశం ఉంటుందని దీంతో తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదురవుతాయని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటి నుంచే నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది.

నెల వ్యవధిలోనే 1.99 మీటర్లకు పడిపోయిన జలాలు

జిల్లాలో నెల వ్యవధిలోనే 1.99 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. జనవరిలో 9.87 మీటర్ల లోతులోకి జలాలు ఉండగా, ఫిబ్రవరిలో 10.51 మీటర్ల లోతులోకి పడిపోయాయి. మార్చిలో 12.50 మీటర్లలోకి పాతాళగంగా పడిపోయింది. ఈ లెక్కన నెల వ్యవధిలోనే 1.99 మీటర్ల అడుగుకు భూగర్భ జలాలు పడిపోయాయి. కామారెడ్డి డివిజన్‌లో 13.72 మీటర్ల లోతులో, ఎల్లారెడ్డి డివిజన్‌లో 14.65 మీటర్ల లోతులో ఉన్నాయి. ఈ లెక్కన జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి డివిజన్‌లో అధిక మొత్తంలో భూగర్భ జలాలు పడిపోయినట్లు సంబంధిత శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

అత్యధికంగా వరి సాగు, పెరుగుతున్న ఎండలే కారణం

జిల్లాలో ఈ యాసంగిలో సుమారు 2.35 లక్షల ఎకరాలకుపైగా వరి సాగు చేశారు. వరి పంటను సాగు చేయడంతోనే భూగర్భ జలాలు రోజురోజుకూ అడుగంటుతున్నట్లు సంబంధితశాఖ అధికారులు భావిస్తున్నారు. దీనికి తోడు రోజు రోజుకూ ఎండలు ముదురుతుండడంతో పాతాలగంగ లోపలికి అమాంతంగా పడిపోతుంది. జిల్లాలో 2 లక్షల వరకు బోరు బావులు ఉన్నాయి. వీటి కింద యాసంగి సీజన్‌లో వరితో పాటు ఇతర పంటలను కూడా అధిక మొత్తంలో సాగు చేస్తున్నారు. దీంతో నీటి వినియోగం కూడా ఎక్కువగానే పెరిగింది. వరి పంటకు 1.2 హెక్టా మీటర్ల నీటి వినియోగం ఉంటే ఆరుతడి పంటలకు 0.6 హెక్టా మీటర్ల నీరు సరిపోతుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో అధిక మొత్తంలో వరి సాగవడంతోనే భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతున్నట్లు సంబంధిత శాఖ అధికారులు వాపోతున్నారు. పంటల సాగుకే కాకుండా ఇతరేతర అవసరాలకు నీటి వినియోగం పెరిగింది. ఎండలు పెరుగుతుండడంతో నీటి వాడకం మరింత పెరుగుతోంది. నీటిని ఇదేవిధంగా వాడినట్లయితే మేలో భూగర్భ జలాలు మరింత లోతులోకి పడి పోయే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో తాగు నీటికి ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంటుందని భూగర్భ జలాల నిపుణులు చెబుతున్నారు. కావున నీటిని అవసరాన్ని బట్టి వినియోగించుకోవాలని కోరుతున్నారు.


ఎత్తిపోతున్న బోర్లు.. ఎండిపోతున్న నీటి బావులు, చెరువులు

జిల్లాలో పగటిపూట ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరిగాయి. గత వారం రోజుల నుంచి జిల్లాలో 35 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలు ముదురుతుండడంతో భూగర్భ జలాలు సైతం అమాంతంగా పడిపోతున్నాయి. ముఖ్యంగా కామారెడ్డి, ఎల్లారెడ్డి డివిజన్లలో భూగర్భ జలాలు తీవ్ర స్థాయిలో అడుగంటుతున్నాయి. కామారెడ్డి మండలంతో పాటు గాంధారి, దోమకొండ, భిక్కనూర్, తాడ్వాయి, లింగంపేట్ మండలాల్లో భూగర్భ జలాలు 17 మీటర్లలోతులోకి పడిపోయాయి. ఎల్లారెడ్డి డివిజన్‌లో ఇదే పరిస్థితి నెలకొంటుంది. భూగర్భ జలాలు పడిపోతుండడంతో మోటార్ బోర్లు ఎత్తిపోతున్నాయి. రెండు ఇంచులు పోసే మోటార్ బోరు ప్రస్తుతం ఆఫ్ ఇంచ్‌లో పోస్తున్నాయి. మరికొన్ని చోట్ల నీటి బావులు, చెరువులు, కుంటలు అడుగంటుతున్నాయి. పంట పొలాల్లో మోటార్ బోర్ల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కామారెడ్డి, ఎల్లారెడ్డి డివిజన్లలోని బోరు బావుల కింద వేసిన పంటల్లో నీరు లేక బీటలు వారుతు ఎండిపోతున్నాయి.





నర్సన్నపల్లి వద్ద సన్నగా పోస్తున్న బోరు మోటార్



నర్సన్నపల్లిలో నీరందక బీటలు వారిన పంట పొలాలు

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి



పోలియో చుక్కలను వేస్తున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్, మార్చి 3: పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి అన్నారు. ఆదివారం కామారెడ్డి జిల్లా జనరల్ ఆసుపత్రిలో చిన్నారులకు కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌తో కలిసి పోలియో చుక్కల మందు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో రహిత దేశాన్ని నిర్మించాలని ఈ కార్యక్రమా నికి ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయని అన్నారు. 0-5 సంవత్సరాల లోపు వయ స్సున్న చిన్నారులందరికీ తప్పనిసరిగా చుక్కల మందు వేయించాలని తల్లిదం డ్రులకు సూచించారు. చిన్నారులకు జ్వరం, జలుబు, దగ్గు వంటి అనారోగ్య సమస్యలు ఉన్నా ఈ మందు వేయించాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ వంద శాతం లక్ష్యాన్ని అందుకునేందుకు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంధ సంస్థలు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, యువజన సంఘాల ప్రతి నిధులు సహకారం అందించాలని కోరారు. జిల్లాలో 1,02,555 మంది ఐదు సంవత్సరాలలోపు చిన్నారు లు ఉన్నారని తెలిపారు. సోమ, మంగళవా రాల్లోనూ చిన్నారులకు ఇంటింటికీ వెళ్లి మందులను వేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారని తెలిపారు. జిల్లాలో 733 పల్స్ పోలియో బృందాలు, 48 సంచార బృందా లను ఏర్పాటు చేశారన్నారు. 2932 మంది ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, 69 మంది పర్యవేక్ష ణ అధికారులు సేవలందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్, ఇమ్యూనైజేషన్ అధికారి అనిల్, ఆర్ఎంఓలు శ్రీనివాస్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించని పంచాయతీ కార్యదర్శులు

- డీఎస్ఆర్‌లో సిబ్బంది తీసిన ఫొటోలను అప్‌లోడ్ చేస్తూ అధికారులను బోల్తా కొట్టిస్తున్నవైనం
- సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవు : డీఎల్‌పీవో

భిక్కనూరు, మార్చి 3: ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి, సంక్షేమ పథకాల అమలులో, ప్రజా సమస్యల పరిష్కారంలో గ్రామ పంచాయతీ కార్యదర్శుల పాత్ర ఎంతో కీలకమైంది. కానీ జిల్లాలో చాలా మంది గ్రామ పంచాయతీ కార్యదర్శులు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తూ గ్రామాభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి, సంక్షేమ పథకాల అమలుకు ఎంతగానో కృషి చేస్తున్నా కొందరు గ్రామ పంచాయతీ కార్యదర్శుల తీరుతో మాత్రం ఆయా గ్రామాల ప్రజలు, అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండటంతో జిల్లాలోని కొందరు గ్రామ పంచాయతీ కార్యదర్శులు పని భారం సాకుతో సమయపాలన పాటించకుండా ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని, గ్రామ పంచాయతీలో తక్కువగా ఉంటూ బయటనే ఎక్కువగా గడుపుతున్న ఆరోపణలు ఉన్నాయి. ఉదయం 10 గంటలైనా గ్రామ పంచాయతీ కార్యాలయానికి రావడం లేదని, మరల మధ్యాహ్నం 12 గంటలకే వెళ్లిపోతున్నారని ఏదైనా పని ఉండి గ్రామ పంచాయితీకి వెళితే ఎంపీడీవో కార్యాలయంలో కానీ కలెక్టరేట్‌లో కానీ మీటింగ్ ఉందని చెబుతూ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండకుండా కాలం వెళ్లదీస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్న పరిస్థితి నెలకొంది. చాలా గ్రామాల్లో ఇప్పటి వరకు ఉపాధి పనులు మొదలు కాలేదని, మురికి కాలువలు కంపు కొడుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులను బోల్తా కొట్టిస్తున్నవైనం

ప్రతిరోజూ ఉదయం 9 గంటల లోపు ప్రతీ గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకుని డీఎస్ఆర్ (డైలీ శానిటేషన్ రిపోర్ట్) యాప్‌లో హాజరు వేసుకుని, ఆ గ్రామంలో జరుగుతున్న పనులు, విజిట్ చేసిన నర్సరీలు, ఉపాధి హామీ పనుల వద్ద ఫొటోలను దిగి రెండు ఫొటోలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కానీ కొందరు 10 గంటలైనా గ్రామ పంచాయతీకి రాకుండానే గ్రామంలో జరిగిన పనులకు సంబంధించి గ్రామ పంచాయితీ సిబ్బంది, ఇతరులు తీసిన ఫొటోలను అప్‌లోడ్ చేస్తూ పై అధికారులను సైతం తప్పుదోవ పట్టిస్తున్నారు. ఇలాంటి సంఘటనలపై అధికారులు గ్రామ పంచాయతీ కార్యదర్శులను హెచ్చరించినా వారు మారడం లేదు.



భిక్కనూరు గ్రామ పంచాయతీ కార్యాలయం

మార్చి 31లోపు వంద శాతం పన్నుల వసూళ్లు సాధ్యమేనా?

గ్రామాల్లో పన్నుల వసూళ్లకు అధికారులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తుంటే పలువురు కార్యదర్శులు పన్నుల వసూళ్లలో అలసత్వం వహిస్తున్నారు. ఇదే తీరును వారు కొనసాగిస్తే మార్చి 31లోపు పన్నులు వసూలు కావడం అనుమానమే. ప్రతిరోజూ ఉదయం గ్రామాల్లో సిబ్బందితో ఇంటింటికీ తిరుగుతూ పన్నులను వసూళ్ల చేయాల్సి ఉండగా, కొందరు సమయపాలన పాటించకుండా ఇష్టారీతిగా వ్యవహరిస్తుండటంతో పన్నుల వసూళ్లలో జాప్యం జరుగుతుంది. పెద్ద గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్ల వేగంగా జరుగుతుండగా చిన్న గ్రామ పంచాయతీల్లోనే పన్నులు వసూలు అంతంత మాత్రంగా జరుగుతుంది. మార్చి 31లోపు ఎట్టి పరిస్థితుల్లో పన్నులు వసూళ్ల చేయాల్సిందేనని ఉన్నతాధికారులు ఆదేశించినా ఫలితం ఉండటం లేదు.

ప్రతిఒక్కరూ సమయపాలన పాటించాల్సిందే..!

● డీఎల్‌పీవో శ్రీనివాస్

పంచాయతీ కార్యదర్శులు తప్పకుండా సమయపాలన పాటించాల్సిందే. ఉదయం 9 గంటలలోపు డీఎస్ఆర్‌లో హాజరు వేసి గ్రామంలోని జరుగుతున్న పనులను విజిట్ చేయాలి. పన్నుల వసూళ్ల కార్యక్రమాన్ని చేపట్టాలి. మార్చి 31లోపు తప్పకుండా వంద శాతం పన్నుల వసూళ్ల పూర్తి చేయాలి. తాను నూతనంగా బాధ్యతలు స్వీకరించినందున ఇప్పటి వరకు కార్యదర్శులు సమయపాలన పాటించడం లేదని తన దృష్టికి రాలేదు. సమయపాలన ప్రతిఒక్కరూ పాటించాల్సిందే లేనియెడల చర్యలు తప్పవు.

నిర్లక్ష్యం వహించే వారు తీరు మార్చుకోవాలి

● ప్రవీణ్‌కుమార్, ఎంపీవో, భిక్కనూరు

గ్రామ పంచాయతీ కార్యదర్శులు తమ మండలంలో సమయపాలన పాటించకపోవడంతో పాటుగా డీఎస్ఆర్‌లో సిబ్బంది తీసిన ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చింది. ఈ విషయంపై వారిని హెచ్చరించడం జరిగింది. ప్రతీఒక్క గ్రామ పంచాయతీ కార్యదర్శి సమయపాలన పాటించాలి. విధులను నిర్లక్ష్యం వహించే వారు ఇక నుంచి తీరు మార్చుకోవాలి లేనియెడల కఠిన చర్యలు తప్పవు. ముఖ్యంగా పన్నుల వసూళ్లు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి. గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి.

పోచారం ప్రాజెక్టును పరిశీలించిన జీఆర్ఎంబీ చైర్మన్



పోచారం ప్రాజెక్టును పరిశీలిస్తున్న జీఆర్ఎంబీ చైర్మన్ డాక్టర్ ముకేష్ కుమార్ సిన్హా

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 3 : పోచారం ప్రాజెక్టును గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు చైర్మన్ డాక్టర్ ముఖేష్‌కుమార్ సిన్హా ఆదివారం పరిశీలించారు. గోదావరి నదులతో అనుసంధానంగా నిర్మాణమైన వివిధ ప్రాజెక్టులను ఆయన పరిశీలిస్తున్నట్లు దానిలో భాగంగా పోచారం ప్రాజెక్టులను ఆయన పరిశీలించారు. వందేళ్ల క్రితం నిర్మాణమైన ఈ ప్రాజెక్టు నిర్మాణం గురించి, ప్రాజెక్టు నిల్వ నీటి సామర్థ్యం, ప్రాజెక్టు ఆయకట్టు తదితర ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను ఆయన ఎల్లారెడ్డి నీటి పారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు కట్టపై నుంచి ప్రాజెక్టును ఆయన పరిశీలించారు. ప్రాజెక్టు ప్రధాన కాలువ నీటి విడుదల గేట్లను, నీటి విడుదలను పరిశీలించారు.



ఎల్లారెడ్డిలో పురాతన బావిని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్

పురాతన బావులను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలి

● కలెక్టర్ జితేష్ వి. పాటిల్

ఎల్లారెడ్డి, మార్చి 3 : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని రామాలయం, గోపాల స్వామి మందిరం ఆవరణలో ఉన్న పురాతన బావులను పర్యాటక కేంద్రాలుగా తీర్చి దిద్దుతామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. బావులను శుభ్రపరుస్తున్న కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన బావులను భావితరాల వారికి అందించాలనే నేపథ్యంలో పునరుద్ధరణ పనులు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ప్రభాకర్, తహసీల్దా ర్, ఆలయ ధర్మకర్త సిద్ది శ్రీధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహా శివరాత్రి జాగరణను విజయవంతం చేయాలి

కామారెడ్డి టౌన్, మార్చి 3: కామారెడ్డి పట్టణంలోని వీక్లి మార్కెట్‌లో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే మహా శివరాత్రి జాగరణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి అన్నారు. ఆదివారం ఏర్పాట్లకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా శివరాత్రి జాగరణ 8వ తేదీన నిర్వహిస్తున్నామని నియోజకవర్గ ప్రజలు, హిందూ బంధువులు ఈ జాగరణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని అన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, పూజలు, లింగోద్భవం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి 1 గంటల వరకు కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.



జాగరణ మహోత్సవ ఏర్పాట్ల కోసం భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

పెన్షనర్లు తమ హక్కులను సాధించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు

ఆర్మూర్‌టౌన్, మార్చి3: విద్యుత్ పెన్షనర్లు ఏకతాటిపైకి వచ్చి తమ హక్కులను సాధించుకోవాలని తెలంగాణ విద్యుత్ పెన్షనర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, గౌరవ అధ్యక్షుడు రమేష్‌లు అన్నారు. ఆదివారం పట్టణంలోని మహాలక్ష్మీకాలనీ కమ్యూనిటీ భవనంలో విద్యుత్ పెన్షనర్ జనరల్ బాడీ సమావేశానికి వారు హాజరై మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విద్యుత్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని, తమకు పూర్తిగా అన్యాయం జరిగిందని, అందరం ఏకతాటిపైకి వచ్చి సమస్యను పరిష్కరించుకుందామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యుత్ పెన్షనర్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ స్వామి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి నర్సింలు, మహాదేవ్, శంకర్, ఎల్లికుమారస్వామి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు బాపూజీ వచనాలయ నూతన భవన నిర్మాణానికి భూమిపూజ

నిజామాబాద్ అర్బన్, మార్చి 3:నగరంలోని రాష్ట్రపతి రోడ్‌లో గల బాపూజీ వచనాలయ లైబ్రరీ నూతన భవనానికి ఈనెల 4న భూమిపూజ చేయనున్నట్లు బాపూజీ వచనాలయ అధ్యక్షుడు భక్తవత్సలం (డిల్లీ), కార్య నిర్వహణ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. రెండు కోట్లతో నిర్మించనున్న నూతన లైబ్రరీ నిర్మాణ భూమిపూజకు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ, ఎంపీ అరవింద్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారుడు మహ్మద్‌అలీ షబ్బీర్, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, నగర మేయర్ నీతూకిరణ్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్, తదితరులు హాజరవుతారని అన్నారు. మధ్యాహ్నం 12గంటలకు భూమిపూజ కార్యక్రమం నిర్వహిం చడం జరుగుతోందని ఆయన తెలిపారు.

అక్బర్‌నగర్ గ్రామ శివారులో చిరుత సంచారం


దాడిలో మృతి చెందిన మేక

● చిరుత దాడిలో మేక మృతి

రుద్రూరు, మార్చి 3 : రుద్రూరు మండలంలోని అక్బర్‌నగర్ గ్రామ శివారులో చిరుత సంచరిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. శనివారం రాత్రి అక్బర్‌నగర్ గ్రామంలో షేక్ బిలాల్ అనే వ్యక్తికి చెందిన మేకను రాత్రి సమయంలో గదిలో నుంచి తీసుకువచ్చి పులిదాడి చేసి చంపేసిందని అనుమానిస్తున్నారు. ఈ మధ్య తరచూ చిరుతపులి సంచారంతోగ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రధాన రహదారి పక్కనే గదిలో ఉన్న మేకపై దాడి చేసి చంపడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గత కొన్ని రోజులుగా గ్రామం మధ్యలోకి చిరుత వచ్చిందని, అదే విధంగా గ్రామ శివారులో ఉన్న గడ్డిలో కూడా చిరుత సంచరిస్తున్నట్లు చెబుతున్నారు. చిరుత సంచారంపై అటవీశాఖ అధికారులు స్పందించి చిరుతకు సంబంధించి విచారణ చేపట్టి జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విండో చైర్మన్‌కు సన్మానం


విండో చైర్మన్‌ను సన్మానిస్తున్న టీపీసీసీ కార్యదర్శి

డిచ్‌పల్లి,మార్చి 3: మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి విండో చైర్మన్‌గా ఎన్నికైన రాంచందర్‌గౌడ్‌ను టీపీసీసీ ప్రధానకార్యదర్శి నగేష్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా నగేష్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి కోసం కృషి చేస్తోందని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రుణాలు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు అమృతాపూర్ గంగాధర్, శ్రీనివాస్, గంగారెడ్డి, తదితరులు ఉన్నారు.

రాజరాజేశ్వర ఆలయంలో తాగునీటి వసతికి నాలుగు ట్యాంకుల అందజేత

నవీపేట,మార్చి3: మండలంలోని నాళేశ్వర్‌లోని రాజరాజేశ్వర ఆలయంలో తాగునీటి సౌకర్యార్థం గ్రామానికి చెందిన కోనేరు పెద్ద భీంరెడ్డి నాలుగు తాగునీటి ట్యాంకులను విరాళంగా అందజేశారు. రాబోయే మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఈ తాగునీటి ట్యాంకులు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, తాజామాజీ సర్పంచ్ సరిన్, సుధాకర్, ప్రసాద్, లక్ష్మణ్, సురేష్, నవీన్, సతీష్ తదితరులున్నారు.

పోలియో రహిత సమాజం కోసం ప్రతీఒక్కరు కృషి చేయాలి

● ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి


ఆర్మూర్‌లో పిల్లలకు పోలియోచుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, మార్చి3: పోలియో రహిత సమాజం కోసం ప్రతీఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆర్మూర్ పట్టణంలోని గోల్‌బంగ్లా వద్ద పల్స్ పోలియో కేంద్రంలో ఆయన పిల్లలకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. పట్టణంలోని బస్టాండ్, గ్రామపంచాయతీ కార్యాలయాలు, వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీప్యూడీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అశోక్, కలిగోట గంగాధర్, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● కన్యక పరమేశ్వరి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

అనంతరం ఆర్మూర్‌లోని శ్రీ వాసవిమాత కన్యక పరమేశ్వరి ఆలయ 17వ వార్షికోత్సవం సందర్భంగా కుంకుమపూజ, చండియాగం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా హిందువులందరు ఏకతాటిపైకి రావాలన్నారు. హిందు ఆలయాలపై దాడిని తిప్పికొట్టాలని, ప్రతీఒక్కరు ధర్మం కోసం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

● నిధులు కేటాయించాలి సీఎస్‌కు వినతి

కొడంగల్‌తో సమానంగా ఆర్మూర్ నియోజకవర్గానికి నిధులు కేటాయించాలని కోరుతూ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి శాంతికుమారికి శనివారం ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి వినతపత్రం అందజేశారు. ఆర్మూర్ నియోజకవర్గంలో మౌలిక వసతుల కోసం ఆసుపత్రిలో పరికరాల కోసం సమాన నిధులు కేటాయించాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి నియోజకవర్గానికి రూ.1424కోట్ల నిధులు కేటాయించాలని, అదే విధంగా ఆర్మూర్ నియోజకవర్గానికి కేటాయించాలని ఎమ్మెల్యే విన్నవించారు.

'నిరుద్యోగులను దగా చేసిన కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి'


కోటగిరిలో మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ నాయకులు దుబాస్ రాములు

కోటగిరి,మార్చి3: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరుద్యోగులకు ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి దగా చేసిందని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని సీపీఐ నియోజకవర్గ నాయకులు దుబాస్ రాములు పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులతో పాటు రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం అమానుషంగా వ్యవహరిస్తుందన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరను కల్పించడం లేదన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో రైతులు ఉద్యమాలు చేస్తే ఉక్కుపాదం మోపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ ఆస్తులను ప్రైవేటు పరం చేయడంలో బీజేపీ దిట్ట అని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీజేపీ అటావో.. దేశ్‌కో బచావో నినాదంతో అన్ని వర్గాల ప్రజలు ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్, నాయకులు గంగాధర్, రాములు, హన్మాండ్లు, నగేష్, వీరేశం, మునీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో భార్యను చంపిన భర్త

● నిందితుడి అరెస్టు రిమాండ్


మాట్లాడుతున్న సీఐ మల్లేష్, ఎస్సై

జక్రాన్‌పల్లి, మార్చి3: భర్త మద్యం సేవించి భార్య కేలోత్ సరిత (35)ను కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్టు డిచ్‌పల్లి సీఐ మల్లేష్, జక్రాన్‌పల్లి సీహెచ్. తిరుపతి తెలిపారు. మద్యం మత్తులో భార్యను చంపిన ఘటన మండలంలోని గన్యతండా గ్రామపరిధిలో నూర్‌సింగ్‌తండాలో చోటు చేసుకుంది. ఆదివారం డిచ్‌పల్లి సీఐ మల్లేష్, జక్రాన్‌పల్లి ఎస్సై సీహెచ్.తిరుపతిలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గన్యతండా గ్రామపరిధిలో గల నూర్‌సింగ్‌తండాకు చెందిన కెలోత్ సరితకు అదే గ్రామానికి చెందిన కేలోత్ శ్రీనివాస్ (సుధాకర్)తో గత 20ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఆమె భర్త శ్రీనివాస్ మద్యం బానిసై తరచు భార్యతో గొడవపడుతూ చిత్రహింసాలకు, కొడుతూ ఉండేవాడన్నారు. ఈనెల 1న మధ్యాహ్నం ఇంటికి వచ్చి శ్రీనివాస్ భార్యతో గొడవ పెట్టుకొని ఆ గొడవలో ఎలాగైన చంపాలని అనుకొని పథకం ప్రకారం అదే రోజు సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో భార్య సరితను చేతులతో ముఖంపై పిడుగుద్దులు గుద్ది ఇంట్లో ఉన్న గొడ్డలితో తలపై, ఇతర చోట్ల విపరీతంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలిపారు. ఈ ఘటన విషయంలో తొలుత అనుమానాస్పద మృతి చెందినట్టు కేసు నమోదు చేసి విచారణ జరపగా వాస్తవ ఘటన మరో విచారణ అనంతరం భర్త శ్రీనివాసే భార్యతో గొడవపడి చంపినట్టు విచారణలో తేలిందని, నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు సీఐ, ఎస్సై తెలిపారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


పోచంపాడ్‌లో 2002-03 పూర్వ విద్యార్థులు


ముప్కాల్ ఆత్మీయ సమ్మేళనంలో 1997-98బ్యాచ్ పూర్వవిద్యార్థులు

మెండోర, మార్చి3: ఆశ్చర్యం.. ఆనందం.. ఆప్యాయతలకు వేదికైంది. మెండోర మండలం పోచంపాడ్‌లో వారు చదువుకున్న పాఠశాల జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో 2002-03బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం జరిగింది. 20ఏళ్ల తర్వాత జీవిత అనుబంధాల్లో మునిగిన వారు ఆదివారం వేదికపై తమ అనుభవాలను బాధ్యతలను పంచుకున్నారు. ఆడిపాడి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం తరచు కలుసుకోవాలని పాఠశాలకు సామాజికంగా స్వచ్ఛందంగా సేవలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు మనోహర్‌కుమార్, వినోద్, బసంత్, నీలకంఠం, రామచంద్ర, సురేందర్‌గౌడ్, మంజుల,గంగామణి,పూర్వవిద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

● ముప్కాల్‌లో ఆత్మీయ సమ్మేళనం

ముప్కాల్: బాల్కొండ మండలం కిసాన్‌నగర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీసమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. 1997-98 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు 25ఏళ్ల తర్వాత అందరు ఒకే చోట కలువడం ఆనందంగా ఉందన్నారు. తరగతి గదుల్లో తిరుగుతూ అనాటి రోజులు గుర్తు చేసుకుంటూ అనాటి జ్ఞాపకాలను నేమరువేసుకున్నారు. చాలా రోజుల తర్వాత కలిసిన సందర్భంగా ఒకరినొకరి యోగా క్షేమాలు అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్య బోధించిన ఉపాధ్యాయులను శాలువ, పూలమాలలతో వారు ఘనంగా సన్మానించారు.

● సిల్వర్ జూబ్లీ జరుపుకున్న విద్యార్థులు


ఉప్లూర్ 1999-2000 పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన 1999-2000 విద్యాసంవత్సర పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు 25 ఏళ్ల తరువాత ఒక చోట కలుసుకుని సిల్వర్‌జూబ్లీ ఉత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలలో వివిధ వృత్తులు, వ్యాపారాలు, ఉద్యోగులు స్థిరపడినపూర్వ విద్యార్థులు ఆదివారం ఒక చోట చేరి ఆప్యాయంగా పలకరించుకుంటు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూల మాలలు, శాలువలతో సన్మానించుకుని వారి ఆశీర్వాదాలు అందుకున్నారు. అంతకు ముందు తాము చదివిన పాఠశాలకువెళ్లి గతస్మృతులను గుర్తు చేసుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి రోజంతా ఆనందడోలికల్లో మునిగి తేలారు. సమ్మేళనంలో ఉపాధ్యాయులు రాజేశ్వర్‌గౌడ్, లింబాగౌడ్, కూనగంగాధర్, భార్గవ్, గంగారాం, సుదర్శన్ , పూర్వ విద్యార్థులు సంతోష్ గౌడ్, చంద్రకాంత్ మంద శ్రీనివాస్, ఏనెడ్ల రవిందర్, సంతోష్ గంగారెడ్డి, ఇబ్రహీం, రమేష్, క్రాంతి, శ్రీనివాస్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

ఖమ్మం బయలుదేరిన సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్(ప్రజాపంథ) నాయకులు

కమ్మర్‌పల్లి, మార్చి 3: ఈ నెల 3 నుంచి 5 వతేదీవరకు మూడు రోజుల పాటు జరుగనున్న యూనిటీ మహాసభలకు ఆర్మూర్ డివిజన్ వ్యాప్తంగా సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథ) నాయకులు ఆదివారం తెల్లవారుజామున భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. వివిధ ప్రాంతాల నుంచి జిల్లా సరిహద్దులోని కమ్మర్‌పల్లికి చేరుకున్నవాకి స్వాగతం పలికి బస్సులు బయలుదేరేముందు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథ) రాష్ట్ర సెక్రటెరియట్ సభ్యులు వి. ప్రభాకర్ ఎర్రజెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వెళ్లిన నాయకులు దేవారాం, కిషన్, మెత్తెన్న, సత్యనారాయణ,రాజేశ్వర్,సత్తెక్క,రమ,దామోదర్, రాజన్న,బాజన్న,రమేష్, లింబాద్రి, అశోక్‌నసీర్, కిషన్ తదితరులు ఉన్నారు.

విలీన సభలకు బయలుదేరిన నాయకులు

ఆర్మూర్‌టౌన్: ఖమ్మంలో జరుగుతున్న మూడు పార్టీల విలీన సభలకు శనివారం రాత్రి నాయకులు బయలుదేరారు. సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథ, సీపీఐఎంల్ పీసీసీ, సీపీఐఎంఎల్ ఆర్‌ఐ పార్టీల విలీన సభలను విజయవంతం చేయడానికి సీపీఐ(ఎంఎల్) నాయకులు టి.కిషన్, మచ్చర్ల రాజన్న, రాగూర్, ఆకుల గంగన్న, అమీనాపూర్ రమేష్, తలారి గంగాధర్, పుప్పాలపల్లి గంగాధర్, కర్రె రాజారాం, లక్ష్మక్క, సునీత, లనిల్‌కుమార్, తదితరులు బయలుదేరారు.

అనాథ పిల్లలకు పండ్ల పంపిణీ


పిల్లలకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

డిచ్‌పల్లి,మార్చి 3 :మండలంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక గల మానవతసదన్‌లో జిల్లా యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని చిన్నారులకు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్ చిన్నారులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవతసదన్ చిన్నారులు చక్కగా చదివి ఉన్నత శిఖారాలు అధిరోహించాలన్నారు. చదువు ద్వారానే ఏదైనా సాధ్యమని అనాథ చిన్నారులకు ప్రభుత్వం అండగా ఉంటోందన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కప్పలవాగులో ప్యాకేజ్ 21 ఔట్ లెట్ ద్వారా నీళ్లు వదలాలి


ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

భీమ్‌గల్‌రూరల్, మార్చి3: కప్పలవాగు పరివాహక గ్రామాల రైతుల కోరిక మేరకు గడిచిన 20 రోజుల క్రితమే ఇరిగేషన్ సీఈతో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి వేల్పూర్‌లో ఆదివారం ఫోన్‌లో మాట్లాడంతో పాటు ఎమ్మెల్యే లెటర్ ద్వారా కూడా నీళ్లు వదలాలి అని విన్నవించడం జరిగిందని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బాబ్లీ నుం చి కూడా శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్‌కు నీళ్లు వదిలారు కావున మొదటి విడుతగా రోజుకు 300ల క్యూసెక్కుల చొప్పున 10 రోజులు 0.5 టీఎంసీ నీరు వదలాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.రెండు రోజుల్లో కప్పవాగు పెద్ద వాగులో ప్యాకేజ్ 21 ఔట్ లెట్ ద్వారా నీళ్ల వదలకుంటే వాగు పరివాహక గ్రామ రైతులతో కలిసి ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి హెచ్చరించారు.

ఉర్దూ అకాడమీ చైర్మన్‌కు సన్మానం


తాహెర్‌బిన్‌హందాన్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోటగిరి,మార్చి3: ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా ఎన్నికైన తాహెర్ బిన్ హందాన్‌ను ఆదివారం మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన నివాసంలో తాహెర్ బిన్ హందాన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నజీర్, కిషన్, వలీయొద్దీన్, భీమా సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● తాహెర్‌బిన్‌హందాన్‌కు సన్మానం

నిజామాబాద్ అర్బన్:రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా నియమితులైన తాహెర్‌బిన్‌హందాన్‌ను ఆదివారం నగరానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి సన్మానించారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవేణు, మాజీమార్కెట్ కమిటీ చైర్మన్ నగేష్‌రెడ్డి, కొండ పాకరాజేశ్ తదితరులు తాహెర్‌ను సన్మానించారు. పార్టీ లో 40 ఏళ్లుగా నిరంతర సేవకుడికిగా పనిచేస్తున్న తాహెర్‌కు ప్రభు త్వం రాష్ట్ర స్థాయి పదవిని ఇవ్వడం గొప్ప విషయమని నేతలు అన్నారు.

క్రికెట్‌లో గెలుపొందిన వారికి నగదు బహుమతి


నాళేశ్వర్‌లో గెలుపొందిన జట్టు సభ్యులు

నవీపేట,మార్చి3: మండలంలోని నాళేశ్వర్‌లో జరిగిన క్రికెట్ పోటీలలో గెలుపొందిన వారికి ఆదివారం నగదు బహుమతిని అందజేశారు. ప్రతీ సంవత్సరం మహాశివరాత్రి సందర్భంగా వారం రోజుల పాటు క్రికెట్ పోటీలు నిర్వహించడం ఆనవాయితీ ఆదివారం జరిగిన ఫైనాల్ మ్యాచ్‌లో విన్నర్ జట్టుకు రూ.7,777, రన్నర్ జట్టుకు రూ.6,666 నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, తాజామాజీ సర్పంచ్ సరిన్, లక్ష్మణ్, సురేష్, ప్రవీణ్, మోహన్ తదితరులున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోటగిరి,మార్చి3: పొతంగల్ మండల కేంద్రంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారన్న సమామాచారం మేరకు వాహనాన్ని పట్టుకుని స్టేషన్‌కు తరలించాలన్నారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆర్మూర్‌లో ఉచిత మెగావైద్యశిబిరం

పెర్కిట్, మార్చి3: ఆర్మూర్ పట్టణంలో మేరు సంఘ భవనంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. లైఫ్ ఆసుపత్రి డాక్టర్ రామగిరి భాను ఆధ్వ ర్యంలో ప్రజలకు బీపీ, షుగర్, నరాల, డెంటల్ పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కొట్బూరు వంశీకృష్ణ, డాక్టర్ శ్రీకాంత్‌లోయ, డాక్టర్ స్రవంతి రెడ్డి, డాక్టర్ నాగభూషణం, డాక్టర్ జ్యోతిలు ప్రజలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు వారికి మేరు సంఘం తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘం అధ్యక్షుడు రవినాథ్, కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి విజయ్, గంగాధర్, మేరు సంఘ సభ్యులు, పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలుగా గాజుల శ్యామల


ఉత్తమ ఉపాధ్యాయురాలిగా గాజుల శ్యామలను సన్మానిస్తున్న దృశ్యం

ఏర్గట్ల,మార్చి 3:మండలంలోని తాళ్లరాంపూర్ ఒడ్డెర కాలనీలో ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న గాజుల శ్యామలను జిల్లా కేంద్రంలో ఆదివారం రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఉత్తమ విద్యను అందిస్తున్నందుకు గాను ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఆమెను రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ అవార్డును అందజేశారు.ఈకార్యక్రమంలో పలువురు ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

అంగవైకల్యాన్ని నిర్మూలించడానికే పోలియో చుక్కలు

సదాశివనగర్, మార్చి 3: అంగవైకల్యాన్ని సమూలంగా నిర్మూలించడానికి పోలియో చుక్కలు వేస్తున్నట్లు జడ్పీటీసీ నర్సింలు తెలిపారు. సదాశివనగర్‌లో చిన్నారులకు పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించి చిన్నారులకు చుక్కలు వేశారు. మండలంలో 2612 మంది 0-5 సంవత్సరాల చిన్నారుల ఉన్నారని 23 బూతులు ఏర్పాటు చేసి వైద్య సిబ్బంది విజయవంతంగా పని చేశారని తెలిపారు. మిగిలిన వారందరికి మరో రెండు రోజులు క్షేత్రస్థాయిలో కార్యక్రమం చేపట్టి వందశాతం పూర్తి చేస్తామని వైద్యాధికారిని ఆస్మాఆసిన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో పల్స్‌పోలియో చుక్కలను జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అనంత్‌రెడ్డి ఆరోగ్య, ఆశ సిబ్బందితో కలిసి వేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ 5 సంవత్సరాల లోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు తప్పకుండా వేయించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటర్ సంజీవ్‌జార్జ్, సూపర్ వైజర్ ప్రభావతి, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి పాల్గొన్నారు.

పెద్ద కొడప్‌గల్: మండలంలో వైద్యశాఖ అధికారులు 5 సబ్ సెంటర్ల పరిధిలో 23 కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీంతో పాటుగానే ఒక మొబైల్ టీంను ఏర్పాటు చేయగ, మండల వ్యాప్తంగా 98 శాతం పోలియో చుక్కలు వేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ రోజు పోలియో చుక్కలు వేయడం 98 శాతం పూర్తయిందని, మిగతా 2 శాతం సోమవారం పూర్తి చేస్తామని వైద్యశాఖ అధికారులు తెలిపారు.

కామారెడ్డి టౌన్: కామారెడ్డిలోని ఆయా వార్డులలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి చిన్నారులకు చుక్కల మందును అందించారు. 14వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్‌లు కొయిలకర్ కన్నయ్య, గెరిగంటి స్వప్నలక్ష్మీనారాయణ, పిట్ల వేణు తదితరలు పల్స్‌పోలియోను విజయవంతం చేసేందుకు తమవంతు ఏర్పాట్లు చేశారు.

లింగంపేట: మండలంలో 4,926 మంది చిన్నారులకు పల్స్ పోలియో చుక్కల మందు పంపిణీ చేసినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు హిమబిందు తెలిపారు. మండలంలో మొత్తం 4,975 మంది 5 సంవత్సరాల లోపు పిల్లలు ఉండగా 35 బూత్‌ల ద్వారా 4,926 మందికి చుక్కల మందు పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు. మిగిలిన వారికి సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ తిరిగి చుక్కల మందు పంపిణీ చేస్తామని ఆమె తెలిపారు.

నసురుల్లాబాద్: మండల కేంద్రంతో పాటు మండలంలో ఆయా గ్రామాల్లో పల్స్ పోలియో కేంద్రంలో 0-5 సంవత్సరాల లోపు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు మందు వేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ విఠల్ మాట్లాడుతూ ప్రతీ చిన్నారికి తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు.

బీర్కూర్: బీర్కూర్ పీహెచ్‌సీ పరిధిలోని బీర్కూర్, నసురుల్లాబాద్ ఉమ్మడి మండలాల వ్యాప్తంగా 95శాతం పల్స్ పోలియో నమోదు అయినట్లు సీహెచ్‌వో రవీందర్ తెలిపారు. ఉమ్మడి మండలాల్లో 0 నుంచి 5 ఏళ్లలోపు 5392 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా 5132 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు.

మద్నూర్: ఉమ్మడి మద్నూర్ మండలంలో డోంగ్లీ పీహెచ్‌సీలో 11 సెంటర్ల పరిధిలో 41 కేంద్రాలలో 98 శాతం పల్స్ పోలియో చుక్కల మందు పూర్తయినట్లు వైద్యురాలు శ్రీ లేఖ తెలిపారు. మేనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో చిన్నారులకు పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 172 మంది వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు చుక్కల మందు వేశారు. డోంగ్లీ పీహెచ్‌సీలో వైద్యురాలు శ్రీ లేఖ చిన్నారులకు చుక్కల మందు వేసి కార్యక్రమం ప్రారంభించారు. ఉమ్మడి మద్నూర్ మండలంలోని 6,820 మంది చిన్నారులుండగా, ఆదివారం 6,669 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యురాలు తెలిపారు.

గాంధారి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శంకర్‌నాయక్, ఎంపీపీ రాధాబలరాంనాయక్, గాంధారి మాజీ సర్పంచ్ సంజీవ్, మాజీ ఉప సర్పంచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద: ఐదు సంవత్సరాలలోపు చిన్నారులందరికీ పల్స్‌పోలియో చుక్కలు వేయించాలని ఎంపీపీ అశోక్‌పటేల్ అన్నారు. మండలంలోని రాజుల్ల గ్రామంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. టార్గెట్ పూర్తి చేయడానికి తదుపరి ఇంటింటికి తిరిగి చుక్కల వేయనున్నట్లు తెలిపారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణలోని రెండవ వార్డులో కాంగ్రెస్ నాయకులు కౌన్సిలర్ మహేశ్వరీ అంగన్‌వాడీ కేంద్రంలో పోలియో చుక్కలను వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టిన పిల్లల నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మణ్, గయాజుద్దీన్, విద్యాసాగర్, ఆజాద్ ఖాద్రి, ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో, రద్దీ ప్రదేశాల్లో పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని వైద్యఆరోగ్య శాఖ అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భిక్కనూరు మండలంలోని కాచాపూర్ గ్రామంలో ఎంపీపీ గాల్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించగా భిక్కనూరు మండలంలో 85శాతం పూర్తి అయినట్లు మండల వైద్యాధికారిణి హేమిమా తెలిపారు.

తాడ్వాయి: మండలంలో పల్స్ పోలియో కార్యక్రమం 93 శాతం నమోదయింది. మండలంలో మొత్తం 5,945 మంది చిన్నారులు ఉండగా ఆదివారం 5,555 మంది చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి నజ్మీరా తెలిపారు. మండలంలో మొత్తం 29 బూతులు, ఒక మొబైల్ టీంలను ఏర్పాటు చేసి చుక్కలమందు పూర్తి చేసినట్లు తెలిపారు.

రాజంపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో పల్స్‌పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలను వేయించాలని అన్నారు. ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు తప్పనిసరిగా వేయించాలని కోరారు. పోలియో రహిత సమాజాన్ని నిర్మించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సదాశివనగర్ పోలియో చుక్కలు వేస్తున్న జడ్పీటీసీ



కామారెడ్డిలో వైస్ చైర్‌పర్సన్



లింగంపేటలో..



సంగంలో..



బీర్కూర్‌లో..



ఎల్లారెడ్డిలో..



మోతెలో బెల్టు షాపులో పట్టుబడిన మద్యం

మోతెలో బెల్టు షాపుపై పోలీసుల దాడి

లింగంపేట, మార్చి 3: మండలంలోని మోతెలో శనివారం రాత్రి బెల్టు షాపుపై పోలీసులు దాడి చేసి రూ.లక్ష విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్సై చైతన్యకుమార్ తెలిపారు. బెల్టు షాపు నిర్వాహకుడు బద్దం ప్రతాప్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపాడు. గ్రామంలో విచ్చలవిడిగా బెల్టుషాపు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేసినట్లు ఎస్సై చెప్పారు. మండలంలో బెల్టు షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సై వెంట కానిస్టేబుల్స్ రామస్వామి, రవిలు ఉన్నారు.



దోమకొండలో కురుమ సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సంఘాల అభివృద్ధికి కృషి చేస్తా..

దోమకొండ, మార్చి 3: సంఘాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే కురుమ సంఘం భవన నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించారు. భవనం పూర్తికావడంతో దానిని ప్రారంభించారు. అంతకు ముందు గొసంగి కాలనీలోని నల్లమారేమ్మదేవి, ముత్యాలమ్మదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పిల్లాపాపలతో ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యయక్షుడు చింతల రాజేష్, పట్టణాధ్యక్షుడు మద్దూరి భూపాల్‌రెడ్డి, కుంట లక్ష్మారెడ్డి, తేలు శ్రీనివాస్, గాజులపల్లి విఠల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఎస్‌పాల్‌రెడ్డి, అంజన్‌రెడ్డి, మనోజ్ కుమార్, సుజాత, గంగాజమున, భూపాల్ లక్ష్మణ్, నారాయణరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా : డ్రైవర్ మృతి



నల్లమడుగు పెద్దతండాలో బోల్తాపడిన ట్రాక్టర్ (ఇన్‌సెట్‌లో మృతుడు శ్రీను)

లింగంపేట, మార్చి 3 : మండలంలోని నల్లమడుగు పెద్దతండా గ్రామ పంచాయతీ ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ ధనవత్ శ్రీను నాయక్ మృతి చెందినట్లు ఎస్సై చైతన్యకుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం హరిత హారంలో నాటిన మొక్కలకు నీరు పోయడానికి ట్యాంకర్లో నీటిని నింపుకుని వస్తుండగా ట్రాక్టర్ బోల్తా పడినట్లు ఆయన తెలిపాడు. ట్రాక్టర్ బోల్తాపడడంతో డ్రైవర్ ధనావత్ శ్రీను అక్కడికి అక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య కావేరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్సై చైతన్యకుమార్ తెలిపారు. మృతుడికి భార్య కావేరి, కుమారులు ఆదిత్య, శ్రీహాన్‌లు ఉన్నారు.



నిజామాబాద్ రైల్వే స్టేషన్‌లో బీర్కూర్ వాసులు

అయోధ్యకు తరలిన బీర్కూర్ వాసులు

బీర్కూర్, ఫిబ్రవరి 3: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 15 మంది భక్తులు అయోధ్యలో కొలువు దీరిన బాల రాముణ్ణి దర్శించుకునేందు కోసం ఆదివారం తరలివెళ్లారు. బీర్కూర్ రామాలయంలో మొదట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిజామాబాద్‌కు వెళ్లారు. అక్కడి నుంచి ప్రత్యేక ట్రైన్‌లో అయోధ్యకు తరలివెళ్లారు.

కృష్ణాజీవాడిలో సీసీరోడ్డు పనుల ప్రారంభం

తాడ్వాయి, మార్చి 3: మండలంలోని కృష్ణాజీవాడి గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టితో గ్రామాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఎన్నికైన కొద్ది కాలంలోనే గ్రామానికి రూ.5లక్షల నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఈ నిధులతో గ్రామంలో సీసీరోడ్డు పనులు చేపడుతున్నట్లు వివరించారు.

భూ కబ్జాకు పాల్పడిన వ్యక్తుల అరెస్టు

కామారెడ్డి టౌన్, మార్చి 3: బెదిరింపులకు పాల్పడడమే కాకుండా బలవంతంగా భూమిని కబ్జాచేసి, ప్రహరీకి ఉన్న సిమెంట్ ప్లేట్స్ ధ్వంసం చేసిన కేసులో పలువురు నేరస్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు తెలిపారు. కామారెడ్డి పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన కుచాని బస్వయ్య దేవునిపల్లి గ్రామ శివారులో గల కాకతీయ నగర్‌లో ఉన్న సర్వే నెంబర్ 207 లో 703.33 గజాలలో ఉన్న 5,6,20,21 నంబర్ ఓపెన్‌ప్లాట్‌ను ఉర్దోండ నర్సయ్య నుంచి 1985లో కొనుగోలు చేశారు. తర్వాత 2003లో ఈ ప్లాట్‌కు రెక్టిఫికేషన్ రిజిస్టర్ చేయగా ఈ ప్లాట్‌కు చుట్టు సిమెంట్ ప్లేట్లు, పోల్స్‌తో ఫెన్సింగ్ వేశాడు. బస్వయ్య నిరాక్షరాస్యుడు కావడంతో దానిని అదునుగా తీసుకుని ప్లాటును అమ్మిన వ్యక్తి నర్సయ్య మరణించాక అతని కొడుకు అయిన ఉర్దోండ రాజయ్య ప్లాట్ సరిహద్దులను మారుస్తు మోసపూరితంగా తప్పుడు దస్తావేజులను సృష్టించాడు. రాజయ్య, అతని కుమారులు ఉర్దోండ రవి, ఉర్దోండ నరేష్, ఉర్దోండ ప్రవీణ్‌లు నర్సయ్య విక్రయించిన భూమిని మళ్లీ క్లైయిమ్ చేస్తూ ఈ విలువైన ఆస్తిని పొందాలనే దురుద్దేశ్యంతో రూ.10లక్షల ఇవ్వాలని లేకపోతే ప్లాట్ నుంచి రోడ్డు వేస్తామని బస్వయ్యను బెదిరించారని తెలిపారు. అంతటితో ఆగకుండా గత సంవత్సరం అక్టోబరు 6న గణమనేని నరేందర్‌రావు, స్వామి, ఉర్దోండ రాజయ్య, అతని కొడుకులు రవి, నరేష్, ప్రవీణ్, 35వ వార్డు కౌన్సిలర్ పోలీస్ కృష్ణాజీరావులు కలిసి ప్లాట్ యాజమానిని బెదిరించి సిమెంట్ ప్లేట్లను, స్తంభాలను పగలగొట్టారు. దీంతో అక్కడికి వచ్చిన ప్లాటు యజమానిని చంపేస్తామని బెదిరించి కొట్టారు. పర్వయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవునిపల్లి పోలీసుస్టేషన్‌లో పలు సెక్షన్‌ల కింద కేసు నమోదైందని తెలిపారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు

నిజాంసాగర్, మార్చి 3 : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు అన్నారు. ఆదివారం నిజాంసాగర్ మండలంలోని ఆరేడు గ్రామంలో గృహ జ్యోతి పథకాన్ని ప్రారంభించారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకానికి కాంగ్రెస్ శ్రీకారం చుట్టిందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పక అమలు చేస్తుందన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మండలంలోని ఆరేపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులను ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పాటుపడుతున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో జుక్కల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయ ప్రదీప్, మండలాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, లోక్యా నాయక్, ఆకాష్, కార్యకర్తలు తదితరులున్నారు.



ఆరేడులో గృహజ్యోతి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

'మోదీ సభను విజయవంతం చేయాలి'

ఎల్లారెడ్డి, మార్చి 3: ఈనెల 5వ తేదీన సంగారెడ్డిలో జరిగే మోదీ సభను విజయవంతం చేయాలని అసెంబ్లీ కన్వీనర్ లింగారావు కోరారు. పలు అభివృద్ధి కార్యకలాపాలకు శంకుస్థాపన చేయడానికి విచ్చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సభను విజయవంతం చేయాలని కోరారు. అదే విధంగా జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా పార్లమెంటరీ బోర్డు బీబీ పాటిల్‌ని అభ్యర్థిగా ప్రకటించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ పార్టీ సభ్యులు అందరూ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉండి కలిసికట్టుగా పని చేసి అత్యధిక భారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రవీందర్‌రావు, మహారాజుల మురళీ, తాడ్వాయి మండల అధ్యక్షుడు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: సంగారెడ్డిలో ఈనెల 5న జరిగే ప్రధాని నరేంద్రమోదీ సభను విజయవంతం చేయాలని ఎల్లారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ లింగారావు కోరారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం కార్యకర్తలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డి అసెంబ్లీ నుంచి పెద్ద సంఖ్యలో మోదీ సభకు తరలిరావాలని, బీబీ పాటిల్‌ను బీజేపీ అభ్యర్థిగా ప్రకటించినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రవీందర్‌రావు, బీజేపీ మండల అధ్యక్షుడు వెంకట్‌రావు, మహారాజుల మురళి, హోటల్ శ్రీను, జిల్లా నాయకులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద: ప్రజలకు నిస్వార్థ పాలకుడిగా ప్రధాని నరేంద్రమోదీ సేవలు అందిస్తున్నాడని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి ఈనెల 5న పటాన్‌చెరులోని ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసే బహిరంగసభలో పాల్గొంటారని తెలిపారు. తెలంగాణలో అధిక ఎంపీ సీట్లు తెలంగాణలో బీజేపీ సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాని పర్యటనను విజయవంతం చేసేందుకు జిల్లా వ్యాప్తంగా కార్యకర్తలు పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు.



బిచ్కుందలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార



బీర్కూర్‌లో మహా పాదయాత్ర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

లోక కల్యాణార్థం మహా పాదయాత్ర

బీర్కూర్, మార్చి 3:లోక కల్యాణార్థం, భారతదేశ శాంతి కోసం ఈనెల 11 నుంచి 22 వరకు మహా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం బీర్కూర్ మండల కేంద్రంలోని శ్రీరామాలయంలో పాదయాత్రకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ పాదయాత్ర 11వ తేదీన ప్రారంభమై 23వ తేదీన యాదాద్రి జిల్లా, ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలోని సోమనాథ్ పుణ్య క్షేత్రానికి చేరుకుంటుందన్నారు. పాదయాత్రలో పాల్గొనే భక్తులకు ఉదయం, మధ్యాహ్నం, రాత్రివేళల్లో అల్పాహారం, ప్రసాదం సౌకర్యాలు కల్పించబడుతాయని అన్నారు. పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడిగా మహిపాల్



భిక్కనూరు, మార్చి 3: జాతీయ మానవ హక్కుల కమిటీ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా భిక్కనూరు మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన మర్రి మహిపాల్ నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మహిపాల్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ తనపై నమ్మకముంచి జిల్లా అధ్యక్షుడిగా నియమించిన జాతీయ అధ్యక్షుడు యాసీన్, రాష్ట్ర అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

బస్వాపూర్‌లో కాంగ్రెస్ నాయకుల సంబరాలు



బస్వాపూర్‌లో గృహజ్యోతి ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

భిక్కనూరు/మాచారెడ్డి/బీర్కూర్, మార్చి 3: మండలంలోని బస్వాపూర్, మాచారెడ్డిలో ఆదివారం గృహజ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే బీర్కూర్‌లో డీఎస్సీ నోటిఫికేషన్ వేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ మేరకు బస్వాపూర్‌లో అర్హులకు జీరో బిల్‌ను అందజేసి కాంగ్రెస్ శ్రేణులు టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను నెరవేర్చడం జరుగుతుంద న్నారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా అర్హులైనా ప్రతిఒక్కరికి అన్ని పథకాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీకి కృతజ్ఞ తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుడుం జీవన్, చితం నూరి సిద్ధరాములు, ఎల్లం, రామగల్ల బాబు, యాదగిరి, చంద్రం, అనీల్, కిరణ్, చందు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఉప సర్పంచ్



ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరుతున్న ఉప సర్పంచ్

గాంధారి, మార్చి 3: ఎల్లారెడ్డి నియోజకవర్గంలో గత కొన్నిరోజుల నుంచి రాజకీయ సమీకరణలో భాగంగా వివిధ పార్టీలలో చేరికలు జోరందుకున్నాయి. అన్ని మండలాల్లో ఎంపీపీలు, జడ్పీటీసీలు కాంగ్రెస్‌లో చేరుతుండడంతో బీఆర్ఎస్ ఖాళీ అవుతుంది. ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు ఆధ్వర్యంలో మండలంలోని సింగిల్ విండో మాజీ చైర్మన్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గీత శ్రీకాంత్‌రెడ్డి, గండివేట్ నుంచి పరమేష్‌లు చేరారు. దీంతో పాటు సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి సింగిల్‌విండో చైర్మన్ సదాశివరెడ్డి ఆయన అనుచ రులతో ఎమ్మెల్యే సమక్షంలో చేరారు. ఇప్పటికే నియోజకవర్గంలోని అన్ని మండలాల మాజీ సర్పం చ్‌లు, ఎంపీటీసీలు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. ఆదివారం గండివేట్ మాజీ ఉప సర్పంచ్ ఇంద్రగౌడ్ ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరగా ఆయనకు ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పీఎంపీ మండల అధ్యక్షుడిగా చంద్రశేఖర్

లింగంపేట, మార్చి 3 : లింగంపేట మండల పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నట్లు ఉపాధ్యక్షుడు రాజు తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా భీంరాజ్, ఉపాధ్యక్షులుగా రామారావు, మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా భాస్కర్, కోశాధికారి రషీద్, సహాయ కార్యదర్శులుగా రామకృష్ణ, రాజేందర్, మూభీన్‌లను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి		బాన్సువాడ	
దర్శన్	హనుమాన్	మహేశ్వరి	గుడాచారి 111
శాంతి	ఊరు పేరు భైరవకొన	వెంకటేశ్వర	ఆపరేషన్ వాలెంటైన్
ప్రియా 70	ఈగల్		
ప్రియా 35	ఆపరేషన్ వాలెంటైన్		

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	100	160	180
వెన్‌కాబ్(కిలో)	100	180	210

